కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే పోచారం

బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

నస్రుల్లాబాద్, మార్చి 5 : బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీలక్ష్మీగోదా సమేత వేంకటేశ్వర స్వామి వారి నవమ వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాలను మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్దినేని నాగేశ్వర రావు, నర్సరాజు, కిరణ్ పాల్గొన్నారు.

పద్య కోకిలకు ప్రశంసాపత్రం

భవానికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న గఫూర్ శిక్షక్

దోమకొండ, మార్చి 5 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నర్రాగుల భవానికి తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవాని 8 నిమిషాల్లో 100 పద్యాలను అలవోకగా చెబుతుందన్నారు. ఆమెను పద్య కోకిలగా అభివర్ణించారు. చిన్న వయసులోనే అపార ప్రతిభకలిగిన భవానికి సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తామని, రికార్డు సాధనకు కృషి చేస్తామన్నారు. అనంతరం కవులు రచయితలు మెమెంటో, ప్రశంసా పత్రంతో సన్మానించగా, దోమకొండకు చెందిన కవి సుదర్శనం రాజయ్య విద్యార్థినికి వెయ్యి రూపాయల నగదును బహుమతిగా అందజేశారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు ఉమాదేవిని, ప్రధానోపాధ్యాయుడు శరత్ కుమార్‌ను శాలువాలతో సన్మానించారు.

నేడు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్

మాచారెడ్డి, మార్చి 5 : భిక్కనూర్ మండలంలోని రైతు వేదికల్లో బుధవారం ఉదయం 9.30 గంటలకు రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రారంభించి మాట్లాడతారని మాచారెడ్డి ఏవో రమ్యశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ను ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు.

దరఖాస్తుదారులు పూర్తి వివరాలు అందజేయాలి

■ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మార్చి 5 : ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు, గతంలో పూర్తి వివరాలు అందజేయకపోతే మండల కేంద్రం, మున్సిపల్ కార్యాలయంలోని సేవా కేంద్రాల్లో అందజేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. అభయ హస్తం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గృహజ్యోతి, మహాలక్ష్మి పథకం వివరాలు సక్రమంగా లేకపోతే రేషన్, ఆధార్ కార్డు, గ్యాస్ పుస్తకం, గ్యాస్ సిలిండర్ పొందిన బిల్లు, ప్రజాపాలన దరఖాస్తు రసీదు తీసుకొని వెళ్లాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న సెల్‌ఫోన్, రేషన్ కార్డు, మీటర్ నంబర్, గతంలో చెల్లించిన బిల్లు రసీదు వెంట తీసుకొని కేంద్రానికి వెళ్లాలని చెప్పారు. వేసవి కాలంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రావొద్దని అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని మండలాలో నిత్యం తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రమేశ్, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఏఈలు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ సేకరించాలి

ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా ఆరు గ్యారెంటీ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం అవసరమైన డాక్యుమెంట్లు సేకరించి ప్రజాపాలన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలని విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం. రిజ్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం. రిజ్వి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్ట్‌వేర్లో వివరాల నమోదుపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి గ్యారెంటీ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదన్నారు. ప్రతి మండలంలోని ఎంపీడీవో కార్యాలయం, మున్సిపాలిటీల్లో అవసరమైన మేర కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

గృహజ్యోతి జీరో బిల్లుల అందజేత

బాన్సువాడ రూరల్/నిజాంసాగర్/పెద్ద కొడప్‌గల్, మార్చి 5 : మండలంలోని బోర్లం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి 200 యూనిట్ల లోపు లబ్ధిదారులకు విద్యుత్ అధికారులు కాంగ్రెస్ నాయకులతో కలిసి జీరో బిల్లులు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యు త్ లైన్‌మన్లు అనిల్‌కుమార్, అంబర్‌సింగ్, శ్రీపాల్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సతీశ్‌గౌడ్, నాయకులు జనార్దన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, బసవయ్య, విఠల్, గంగారాం, వెంకాగౌడ్, రాము లు తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో గృహజ్యోతి జీవో బిల్లులను స్థానిక నాయకులు, ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల పథకం అమలులో భాగంగా ప్రతి కుటుంబానికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భూమాగౌడ్, ఢాక య్య, యూసుబ్ పాల్గొన్నారు. పెద్దకొడప్‌గల్ గ్రామంలో గృహ జ్యోతి జీరో విద్యుత్ బిల్లుల పంపిణీని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ట్రాన్స్‌కో అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, పండరి, సంజీవ్, బస్వరాజ్ దేశాయి, విఠల్, విద్యుత్ సిబ్బంది రామయ్య, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు వీడాలి

నస్రుల్లాబాద్, మార్చి 5 : మండలంలోని కంశెట్‌పల్లి గ్రామంలో ఎస్ఆర్ఎన్‌కే కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు మూఢ నమ్మకాలు వీడాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీదేవి, స్పెషల్ ఆఫీసర్ వాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూషణ్, బీజేపీ నాయకుడు సున్నం సాయిలు, గ్రామ కార్యదర్శి శశిధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురిని మోసం చేసిన నిందితుడి అరెస్టు

వినాయక్‌నగర్, మార్చి 5 : ఏటీఎం సెంటర్ల వద్ద అమాయకులను టార్గెట్‌గా చేసుకొని, వారి కార్డులను మార్చి వరుస మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన గద్దమిది రమేశ్ అలియాస్ రాజు కొంతకాలంగా ఏటీఎం సెంటర్ల వద్దకు వచ్చే అమాయకులను లక్ష్యంగా చేసుకున్నాడు. సదరు నిందితుడు ఉదయాన్నే బస్సులో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంటాడు. బస్టాండ్ వెనకాల, రైల్వేస్టేషన్ ఏరియాలో ఉన్న ఏటీఎం కేంద్రాల వద్దకు చేరుకొని, డబ్బులు విత్‌డ్రా చేయడం రాని వారిని ఎంచుకుంటాడు. తాను కూడా డబ్బులు డ్రా చేసుకునేందుకు వచ్చినట్లు నటించి, వారితో మాటలు కలిపి డబ్బులు డ్రా చేసి ఇస్తానని నమ్మిస్తాడు. వారి ఏటీఎం కార్డును మిషన్‌లో పెట్టి పిన్ నంబర్ అడిగి టైప్ చేసి డబ్బులు డ్రా చేయకుండా.. మిషన్ పనిచేయడం లేదని లేక అందులో డబ్బులు లేవని వారిని నమ్మిస్తాడు. తన వద్ద ఉన్న మరో నకిలీ ఏటీఎం కార్డును వారి చేతుల్లో పెట్టి, వారు అక్కడి నుంచి వెళ్లిన అనంతరం డబ్బులు డ్రా చేసుకొని పరారవుతాడు. నిజామాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు ముగ్గురి ఏటీఎం కార్డులను మార్చి, డబ్బులు కాజేసిన రమేశ్‌ను ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు పర్యవేక్షణలో సిబ్బంది పట్టుకున్నారు. రూ.30 వేల నగదుతో పాటు ఓ నకిలీ ఏటీఎం కార్డును సీజ్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

సమ్మె బాటలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది

భిక్కనూరు,మార్చి 5 : టీయూ సౌత్ క్యాంపస్‌లో అవుట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న సిబ్బంది సమ్మె బాట పట్టారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. సౌత్ క్యాంపస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, రవి మాట్లాడుతూ.. ఆర్‌పీఎస్ 20 వేతనం చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని రిజిస్ట్రార్‌కు విన్నవించారు. అందరిని రెగ్యూలరైజ్ చేసి ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్ర శేఖర్, రవి శ్రీకాంత్, స్వామి, శ్రీమాన్, చంద్రమోహన్, రాజు, రాజేశ్వర్, మల్లేశ్, వేణుమాధవ్, హారిక, రజిత, బాల్‌రాజు పాల్గొన్నారు.

సమ్మె చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది

రూ.39.29 కోట్లతో బడ్జెట్

బాన్సువాడ, మార్చి 5 : బాన్సువాడ మున్సిపాలిటీలో ప్రత్యేక బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ గంగాధర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది వెంకటనారా యణ 2023-24 సంవత్సరం మార్చి నెలవరకు వచ్చిన ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. 2023- 24 బడ్జెట్ సవరణతో పాటు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గత ఏడాది రూ.38 కోట్ల 76 లక్షల బడ్జెట్ ప్రవేశపెట్టగా, ఈ ఏటా రూ.39 కోట్ల 29 లక్షల అంచనా వేశారు. ఇంటిపన్ను, తైబజార్, ఇంటి నిర్మాణానికి వచ్చిన పర్మిషన్, నీటి పన్ను మొత్తం కలిపి రూ.7 కోట్ల వరకు రావచ్చని అంచనా వేసినట్లు కమిషనర్ అలీం తెలిపారు. మున్సిపల్‌కు వచ్చే ఆదాయంలో పదిశాతం గ్రీన్ బడ్జెట్‌కు కేటాయిస్తామన్నారు. వైస్ చైర్మన్ జుబేర్, ఇన్‌చార్జి మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి, కౌన్సిలర్లు వెంకట్, సుగుణ, ఫిర్దోస్ పాతిమా, రేష్మా బేగం, సరిత, రవీందర్‌రెడ్డి, లింగమేశ్వర్, బాల్‌రాజ్, నందకిశోర్, రమాదేవి, రుక్మిణి, మోతిరామ్ తదితరులు ఉన్నారు.

మున్నూరు కాపు సంఘం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కామారెడ్డి, మార్చి 5 : మున్నూరు కాపు సంఘం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా మున్నూరు కాపు సంఘంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో మున్నూరు కాపు సంఘం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, యువకులను ఇండస్ట్రీలు పెట్టుకోవడానికి ప్రోత్సహిస్తామని ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. సమావేశంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు మామిళ్ల అంజయ్య, ప్రధాన కార్యదర్శి అంజయ్య, స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ నీలం నర్సింహులు, జిల్లా మహిళా అధ్యక్షురాలు లలిత, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య

అనుమతి లేకుండా షెడ్లను నిర్మించొద్దు

కామారెడ్డి, ఫిబ్రవరి 5 : జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి, హౌసింగ్‌బోర్డు, అశోక్‌నగర్ కాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన షెడ్లను మున్సిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానయ్య మాట్లాడుతూ.. పట్టణంలో ఇంటి నంబర్ లేకుండా నిర్మించిన షెడ్ల స్థలం డాక్యుమెంట్లు సమర్పించాలన్నారు. అనుమతి లేకుండా షెడ్లను నిర్మిస్తే పురపాలక సంఘం చట్టం ప్రకారం సీజ్ చేస్తామని హెచ్చరించారు.

పరీక్ష ప్యాడ్ల అందజేత

బీబీపేట్, మార్చి 5 : మండలంలోని యాడారంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదుతున్న విద్యార్థులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఎగ్జామ్ ప్యాడ్లు, స్నాక్స్ అందజేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ అంకన్నగారి నాగరాజ్‌గౌడ్, మండల చైర్మన్ నాగేశ్వర్, పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేత

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న జడ్పీటీసీ తదితరులు

రామారెడ్డి, మార్చి 5: మండలంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు రావాలని కోరుతూ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు జడ్పీటీసీ మోహన్‌రెడ్డి తదితరులు మంగళవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. శివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మద్దికుంట ఎంపీటీసీ సభ్యుడు రాజేందర్, తాజా మాజీ సర్పంచ్ రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు బండి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై దృష్టి పెట్టాలి

మహిళా సంఘాల సభ్యులతో ఐకేపీ డీపీఎం రమేశ్‌బాబు

గాంధారి, మార్చి 5: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలంటే చేపల పెంపకంపై దృష్టి పెట్టాలని ఐకేపీ డీపీఎం రమేశ్‌బాబు అన్నారు. గాంధారిలో సదాశివనగర్, లింగంపేట, గాంధారి మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు చేపల పెంపకంపై మంగళవారం అవగాహన సదస్సును ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థిక సమృద్ధిని సాధించడానికి బ్యాంకు లింకేజీల ద్వారా చేపల పెంపకం కోసం రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పంట చేనుల్లో, ఇంటి మిద్దెలపై చేపలను పెంచి ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. సదస్సులో తెలంగాణ గ్రామీణ బ్యాంకుల మేనేజర్లు వేణు, అశోక్‌రెడ్డి, అరుముగం, గాంధారి, సదాశివనగర్, లింగంపేట మండలాల సమాఖ్య అధ్యక్షురాళ్లు పుష్పరాణి, శోభ, సులోచన, ఏపీఎం గంగరాజు, మూడు మండలాల సీసీలు, మహిళా సమఖ్య సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న డీపీఎం రమేశ్‌బాబు

డైరెక్టర్ దంపతుల అంత్యక్రియలు పూర్తి
- పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత

సదాశివనగర్, మార్చి 5: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సదాశివనగర్ విండో డైరెక్టర్ ఏనుగు జనార్దన్‌రెడ్డి - ప్రతిభ దంపతుల అంత్యక్రియలను మంగళవారం నిర్వహించారు. అంత్యక్రియల్లో ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దంపతుల పాడెను మాజీ ఎమ్మెల్యే సురేందర్ మోశారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ ఓ మంచి కార్యకర్తను కోల్పోయిందన్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి డ్రైవర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అంత్యక్రియల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, విండో చైర్మన్ కమలాకర్ రావు, జడ్పీటీసీ నర్సింహులు, ఎంపీపీ అనసూయా రమేశ్, విండో డైరెక్టర్లు, నాయకులు, గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంత్యక్రియలకు హాజరైన ప్రజలు

గుండెపోటుతో హైకోర్టు న్యాయవాది కృష్ణారెడ్డి మృతి

సదాశివనగర్, మార్చి 5: హైకోర్టు అడ్వకేట్, అడ్లూర్ ఎల్లారెడ్డి మాజీ సర్పంచ్ పైడి కృష్ణారెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో గుండె పోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే పైడి మధుసూదన్‌రెడ్డి కుమారుడు పైడి కృష్ణారెడ్డి ప్రస్తుతం హైకోర్టు న్యాయవాదిగా పని చేస్తున్నారు. కృష్ణారెడ్డి 2014 నుంచి 2019 వరకు అడ్లూర్ ఎల్లారెడ్డి సర్పంచ్‌గా పని చేశారు. ఆయన అంత్యక్రియలను స్వగ్రామం అడ్లూర్ ఎల్లారెడ్డిలో నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కృష్ణారెడ్డి(ఫైల్)

ఇసుక తరలిస్తున్న వాహనాల పట్టివేత

బిచ్కుంద, మార్చి 5: మండలంలోని ఖత్‌గావ్ మంజీరానది పరీవాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్, బొలెరో వాహనాలను సోమవారం రాత్రి పట్టుకున్నామని అన్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వద్దు'

నిజాంసాగర్, మార్చి 5: జుక్కల్ మండలంలోని హంగర్గా గ్రామంలో ఉన్న నర్సరీని ఎంపీడీవో శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. నర్సరీలో చేపట్టిన మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలని, ఒక్క మొక్క కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి తాగునీటి సరఫరా తీరు, లీకేజీలు, క్లోరినేషన్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

అగ్ని ప్రమాదంలో సామగ్రి దగ్ధం

పిట్లం, మార్చి 5: మండల కేంద్రంలోని పడిగెల శ్రీనివాస్ ఇంట్లో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. మంచం, బెడ్ కాలడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు కేకలు వేశారు. వెంటనే ఇరుగుపొరుగు వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో బట్టలు, ఇతర సామగ్రి కాలిపోయాయని యజమాని శ్రీనివాస్ తెలిపారు.

'పీఎం కిసాన్' కోసం మ్యాపింగ్ చేసుకోవాలి

ఎల్లారెడ్డి, మార్చి 5: ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకం డబ్బులు రాని రైతులు ఇండియన్ పోస్టల్ బ్యాంక్‌లో ఖాతా తీసుకొని ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేయించుకోవాలని ఏఈవో రాజాగౌడ్ మంగళవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. మ్యాపింగ్ చేయించుకున్న రైతులకే డబ్బులు జమ అవుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు స్థానిక ఏఈవోను సంప్రదించాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నిజాంసాగర్/ మద్నూర్/ దోమకొండ, మార్చి 5: మహ్మద్‌నగర్ మండలంలోని తున్కిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. మద్నూర్ మండలంలోని అంతాపూర్ గ్రామంలో రూ.ఐదు లక్షల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్డు పనులను స్థానిక నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో హన్మాండ్లు స్వామి, సా యిలు, రమేశ్, గంగాధర్, రాజు, ఈరన్న, శంకర్ పటేల్, దత్తు తదితరులు పాల్గొన్నారు. దోమకొండ మండలంలోని సీతారాంపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జడ్పీటీసీ తిర్మల్ గౌడ్ ప్రారంభించారు. ఎన్ ఆర్‌జీఎస్ నిధుల నుంచి సీతారాంపూర్, లింగుపల్లి గ్రామాల్లో రూ.10లక్షల వ్యయం తో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ జ్యోతి, మల్లారెడ్డి, రామస్వామిగౌడ్, సత్యనారాయణ, సంతోష్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, గోపాల్‌రెడ్డి, గంగయ్య, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగురాళ్ల తవ్వకం

తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

రామారెడ్డి, మార్చి 5: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన చెందిన చిన్న లక్ష్మీగంగాధర్ కుటుంబ సభ్యులకు సున్నపురాళ్ల తండాలోని 288 సర్వేనంబరులో ఐదెకరాల భూమి ఉన్నది. ఆ భూమిలో రంగురాళ్లను తవ్వి బ్రోకర్లకు విక్రయించారు. విషయం తెలియడంతో ఫారెస్ట్ అధికారులు మంగళవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ లక్ష్మణ్‌ను వివరణ కోరగా.. విషయం తమ దృష్టికి రాలేదన్నారు.

మక్కజొన్నలో తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

దుర్గం శివారులో మక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రత్న

గాంధారి, మార్చి 5: మండలంలోని దుర్గం, గుజ్జుల్ తండా శివారుల్లో రైతులు సాగుచేస్తున్న పంటలను ఎల్లారెడ్డి ఏడీఏ రత్న మంగళవారం పరిశీలించారు. మక్కజొ న్న పంటలో భాస్వరం లోపం ఉన్నదని, కాండం తొలుచు పురుగు ఆశించినట్లు గుర్తించా రు. భాస్వరం లోప నివారణకు ఎన్‌పీకే పోషకాలు ఉన్న 28:28:0 మందును లేదా 19:19:19 మందును ఎకరానికి ఒక కిలో చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. కాండం తొలచు పురుగు నివారణకు ఎమ్మామ్యోక్లీన్ బెంజోయేట్ ఐదు శాతం మందును ఎకరానికి వంద గ్రాములు చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. ఏవో నరేశ్, ఏఈవో కరుణేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన..

బీబీపేట్, మార్చి 5 : మండలంలోని మల్కాపూర్ గ్రామంలో వరిని జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి పరిశీలించారు. వాతావరణ మార్పులతో వరిలో బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు గమనించి వాటి నివారణ చర్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో రాఘవేంద్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **NEHA**, H.No.5-112, Mamidipalle, Armoor, (D) Nizamabad Now changed my name as **MOHAMMED NEHA W/o. MOHAMMED NISARUDDIN.**

CHANGE OF NAME

I, **GADDAM SUMALATHA**, H.No. 7-25, Velpur, (D) Nizamabad. Now changed my name as **GADDAM SUMA W/O. GADDAM PRABHAKER REDDY**

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే.

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311802

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ముగిసిన చుక్కల మందు పంపిణీ

ఎల్లారెడ్డి, మార్చి